# జీవితానందం

రష్యన్ మూలం: చెహోవ్
తెలుగు: కరుణారుణ

జీవితంలో సుఖాలకన్నా కష్టాలే ఎక్కువ. కాని అట్లాగని ఆనందంగా జీవించడం అంత కష్టమేమీ కాదు. ఆనందమంటే కోటిరూపాయల లాటరీ గెలవటమో, ప్రభుత్వం నుండి బిరుదులూ, అవార్డులూ తీసుకోవడమో, మిస్ యూనివర్సును పెళ్లి చేసుకోవడమో కాదు. క్రమేణా డబ్బూ, కీర్తి, సుఖాలూ అన్నీ అలవాటుగా మారతాయి. అందువల్ల కష్టాలలో కూడా సుఖాన్ని అనుభవించాలంటే--ఉన్నదాంతో తృప్తిపడాలి; పరిస్థితులు ఇప్పుడున్న దానికన్నా ఛండాలంగా ఉండగలవనుకోవాలి.

జేబులో అగ్గిపుల్లలు భగ్గుమన్నాయనుకో జేబులో గంధకం లేనందుకు ఆనందించు. బంధువులు ఇంటి మీదకి దండెత్తివస్తే వచ్చింది బంధువులే పోలీసులు కాదుగా అనుకో. వేలు తెగిందనుకో - కంట్లో గాయం కానందుకు భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకో. మీ ఆవిడ గానసాధన యింట్లో నీ వునికిని నరకం చేస్తే - ఎంత చెడ్డా అది గానమే - కుక్కలు మొరిగితే, గాడిద నీ చెవిలో ఓండ్రిస్తే ఏం చేస్తావు. బరువులు మోసే పశువ్వీ, గాడిదవీ కాదు. ఊరపందివీ, కుక్కవీ కాదు. ఈగవీ, దోమవీ, నల్లివీ కాదు. ఇవన్నీ సంతోషించవలసిన విషయాలు కావూ! ఇంట్లో వున్నావు. జైల్లో లేవు. అప్పులవాళ్లు నీ కాళ్లూ చేతులూ విరగ్గొట్టలేదు. పత్రికలవాళ్లు నీ రచనలు వేసుకొని డబ్బులు ఇస్తామనీ ఇవ్వలేదు. ఫరవాలేదు. ఊళ్లోనే వున్నావు. థార్ ఎడారిలో లేవు.

ఒక్క పన్నే నొప్పెడుతున్నది. నోరంతా పుచ్చిపోలేదు.

మునిసిపాలిటీ చెత్తబండిని లాగే గుర్రానివి కావు. నీకిష్టం లేని పేపరు చదవక్కర్లేదు. ఒక్క భార్యే వున్నది. ముగ్గురు లేరు.

జైల్లో వేశారా. ఇంకా నయం. తోడేళ్ల గుంపు మీదపడి పీక్కుని తినలేదు. బెత్తంతో బాదారా. ఫరవాలేదులే. ఇనపకడ్డీ కాదుగా.

నీ పెళ్లాం లేచిపోయిందా. నీకే ద్రోహం చేసింది. దేశానిక్కాదుగా.

*ప్రముఖ రష్యన్ రచయిత చెహోవ్ కథలు 20 సంపుటాలుగా రష్యన్ భాషలో వెలువడ్డాయి. వాటిలో పై కథ 'జీవితానందం' లేదు. అరుదైన ఈ కథతో కథాసామ్రాజ్యపు తాళం తెరుస్తున్నాం. వచ్చే వారం నుంచి ప్రతివారం ఆంధ్రప్రభ పాఠకులకోసం చెహోవ్ కథలు అందిస్తున్నాం*

*ఎడిటర్*

